సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

జనం 'ఉల్లి'కిపాటు



రైతుబజార్‌లో ఉల్లి కోసం క్యూకట్టిన వినియోగదారులు

ఏయూ క్యాంపస్: ఉల్లి ధర రోజురోజుకూ కొండెక్కి కూర్చుంటుంది. దీంతో జనం రైతుబజార్‌లో ఉల్లిపాయల స్టాళ్ల వద్ద బారులు తీరుతున్నారు. శుక్రవారం పెదవాల్తేరు రైతుబజార్‌లో పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఉల్లిపాయలు కొనుగోలు చేయడానికి తరలివచ్చారు. కిలో ధర రూ.55కు ఉల్లిపాయలు విక్రయించారు. ఉల్లి ధరలు గత వారం రోజులుగా పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులు ముందస్తుగా ఎక్కువ మోతాదులో కొనుగోలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఉల్లి ధరలు మరింత పెరుగుతాయనే భయంతో జనం క్యూ కడుతున్నారు. వినియోగదారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో క్యూ లైన్లు ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతున్నారు. టమాటా ధర సైతం శుక్రవారం నాటికి రూ.28కి చేరింది.

నిల్వ నీటిలోనే దోమల ఉత్పత్తి



ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా సూపర్‌వైజర్ రత్నం

మద్దిలపాలెం : ఇంటి పరిసరాలలో నిల్వ నీటిలోనే దోమలు ఉత్పత్తి అవుతాయని, ప్రతి శుక్రవారం నీటి నిల్వలను గుర్తించి తొలగించుకోవాలని మలేరియా విభాగం సూపర్‌వైజర్ వైవీఎస్ రత్నం సూచించారు. జీవీఎంసీ 23వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని రత్నం పరిశీలించారు. ఈ సందర్భంగా యాంటీ మలేరియా బృందానికి సూచనలు చేశారు. ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శ్రీను రెడ్డి, శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన యువకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో మునిగిపోతున్న ఇద్దరు యువకులను లైఫ్ గార్డ్స్ కాపాడారు. విజయనగరానికి చెందిన 9 మంది యువకులు శుక్రవారం సాయంత్రం సరదాగా గడిపేందుకు ఇక్కడ బీచ్‌కు వచ్చారు. కాసేపు సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో వారిలో కె.సాయి, ఇ.జశ్వంత్ మునిగిపోతుండగా గమనించిన లైఫ్‌గార్డ్స్ చందు, సూరాడ నూకరాజు, సతీష్ సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. మెరైన్ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సీపీకి వినతులు



సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న సీపీ రవిశంకర్

దొండపర్తి : పోలీస్ సిబ్బంది సమస్యలు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీసుల సమస్యల పరిష్కారానికి సీపీ శుక్రవారం తన ఛాంబర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13 మంది సిబ్బంది తమ సమస్యలను వినతుల రూపంలో సీపీకి తెలిపారు. ఇందులో ప్రమోషన్లు, క్వార్టర్లు, విభజన సమయంలో అనకాపల్లికి వెళ్లిన ఆరుగురు సిబ్బందిని తిరిగి నగర పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ సీపీకి వినతులు అందజేశారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

మెరుగైన ర్యాంకు సాధన దిశగా..



సోషల్ సైన్స్ భవనం వద్ద శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

- నాక్ పర్యటన నేపథ్యంలో ముస్తాబవుతున్న ఏయూ
- భవనాలకు పెయింటింగ్‌తో కొత్తరూపు
- స్వచ్ఛభారత్‌లో భాగస్వాములవుతున్న విద్యార్థులు



సరికొత్తగా దర్శనమిస్తున్న డీన్ కార్యాలయం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సరికొత్తగా దర్శనమిస్తోంది. భవనాలకు సరికొత్త వర్ణాలు అద్దుతున్నారు. విశ్వవిద్యాలయం పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు. త్వరలో నేషనల్ అక్రిడియేషన్ అసెస్‌మెంట్ కౌన్సిల్(ఎన్‌ఏఏసీ) సభ్యుల బృందం కొద్దిరోజుల్లో ఏయూను సందర్శించనుంది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయానికి అధికారులు మెరుగులు దిద్దుతున్నారు. వచ్చే నెల మొదటి వారంలో ఈ కమిటీ సభ్యులు ఏయూలో మూడు రోజులు సందర్శించనున్నారు. ఇప్పటికే నాక్ కమిటీకి అవసరమైన సమగ్ర సమాచారాన్ని ఏయూ అందించింది. దీని ఆధారంగా కమిటీ మూడు రోజులు ఏయూలో వివిధ విభాగాలను సందర్శిస్తుంది. వారు అందించే మార్కుల ఆధారంగా పొందే ర్యాంకింగ్ రానున్న ఐదు సంవత్సరాలు ఏయూకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. జాతీయ స్థాయిలో నాక్ ర్యాంకింగ్ విభిన్న పథకాలు, ప్రాజెక్టుల మంజూరులో కీలకంగా నిలుస్తుంది. గత నాలుగు సంవత్సరాలు ఏయూలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు నాక్ కమిటీకి వివరించనున్నారు. దీంతో ఈ దఫా గతంలో కంటే మెరుగైన ర్యాంక్ సాధించే అవకాశం ఉందని ఏయూ అధికారులు, ఆచార్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రణాళికాబద్ధంగా ప్రతి విభాగాన్ని అభివృద్ధి చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఇంజినీరింగ్, ఆర్ట్స్, సైన్స్, న్యాయ, ఫార్మసీ కళాశాలల పరిధిలోని ప్రతి భవనానికి మరమ్మతులు చేపట్టారు. మరుగుదొడ్లను ఆధునికీకరించారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. ప్రస్తుతం భవనాలకు పెయింటింగ్ వేసే పనులు చివరి దశకు చేరాయి. దీంతో వర్సిటీలోని ప్రతీ భవనం కొత్తరూపుతో దర్శనమిస్తోంది. భవనం లోపల పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికే పారిశుధ్య సిబ్బంది పలు దఫాలు విభాగాలను శుభ్రంచేసి, వ్యర్థాలను తొలగించారు. ప్రస్తుతం విద్యార్థులు భాగస్వాములవుతూ స్వచ్ఛందంగా శ్రమదానం చేస్తున్నారు.



సోషల్ సైన్స్ భవనానికి పెయింటింగ్ వేస్తున్న దృశ్యం

నెలాఖరు నాటికి పనులు పూర్తి

వర్సిటీలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. వర్సిటీ అధికారులు కూడా పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పూర్తి స్థాయిలో ప్రతీ విభాగం నాక్ పర్యటనకు సన్నద్ధంగా ఉండేలా ప్రణాళిక రచించి పనులు పూర్తి చేస్తున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ స్వయంగా భవనాలను పరిశీలించి, పనుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఏయూ సమాచారం

ప్లాస్టిక్ రహితంగా ఏయూ



పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ప్లాస్టిక్ రహితంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలని విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. శుక్రవారం ఏయూ మెయిన్ గేట్ వద్ద 'సే నో టు ప్లాస్టిక్'నినాదంతో కూడిన పోస్టర్లను ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విభాగ విద్యార్థులు విశ్వవిద్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా–పర్యావరణహితంగా తీర్చిదిద్దుతామని నినాదాలు చేశారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఇచ్చిన పిలుపును స్వీకరిస్తూ విశ్వవిద్యాలయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రిస్తూ, పూర్తిగా తగ్గించే విధంగా విద్యార్థుల భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగం ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో అతిథి ప్రసంగం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో శుక్రవారం అతిథి ప్రసంగం నిర్వహించారు. భారతీదాసన్ యూనివర్సిటీ ఆచార్యుడు ఎం.శశిధర్.. అనాటమీ బిహైండ్ డిస్కవరీ ఆఫ్ ఏ జీన్ అంశంపై ప్రసంగించారు. అనంతరం ఆయనను విభాగాధిపతి డాక్టర్ వి.లక్ష్మి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ జెనిటిక్స్, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ విభాగాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆచార్య శశిధర్‌ని సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు

రిజిస్ట్రార్‌కు అభినందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను కేఎల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య పార్థసారథి వర్మ అభినందించారు. శుక్రవారం ఏయూను సందర్శించిన ఆచార్య వర్మ.. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్‌లతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వర్మకు వివరించారు.



రిజిస్ట్రార్ స్టీఫెన్‌ని అభినందిస్తున్న ఆచార్య పార్థసారథి

జగనన్న సురక్ష శిబిరాలకు విశేష స్పందన



కేడీపీఎం ఉన్నత పాఠశాలలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు



కేడీపీఎం ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ స్టాల్



22వ వార్డులో..

బీచ్ రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం జీవీఎంసీ 22వ వార్డు 1086148 సచివాలయంలో నిర్వహించిన శిబిరంలో 503 మందికి వైద్య పరీక్షలు చేశారు. పలు రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, శశికళ, స్వాతి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక 20వ వార్డు 159 సచివాలయం పరిధిలోని కేడీపీఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రజలకు సాధారణ ఆరోగ్య, చర్మ, కంటి, రక్త పరీక్షలు నిర్వహించి, వైద్యులు తగిన మందులు అందజేశారు. ఐసీడీఎస్ సిబ్బంది పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం సుమతీభాయి, వ్యవసాయ మార్కెటింగ్ వైస్ చైర్మన్ యువతా రెడ్డి, 20వ వార్డు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, సీవో రత్నకుమారి, సీనియర్ నాయకులు ముచ్చల సురేష్, రవికిరణ్ రెడ్డి, కిల్లాన రాంప్రసాద్, సచివాలయం కన్వీనర్స్ పద్మజ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వెటరన్ అథ్లెట్ మీట్ రేపు

మురళీనగర్: విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఆదివారం వెటరన్ అథ్లెటిక్స్ మీట్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.బాబూరావు, మంగా వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రన్నింగ్ 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీ., 1500 మీ., 5000 మీ., వాకింగ్ 5 కి.మీ, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, జావిలిన్ త్రో, డిస్కస్‌త్రో, హేమర్ త్రో వంటి క్రీడల్లో పోటీలు జరుగుతాయన్నారు. 30 ఏళ్లు దాటిన వారందరూ పాల్గొనవచ్చని, వయసుల వారీగా విభజించి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు వారి పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో రావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన వారిని నవంబర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. పాల్గొన్న వారికి స్నాక్స్, మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. వివరాలకు 97013 47311, 98666 68966, 83091 57522, 92474 24395 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

29న మార్టిన్ లూథర్ కింగ్ చిత్ర సమీక్ష

మద్దిలపాలెం: ప్రజాస్వామ్యంలో ఓటు విలువ చెబుతూ రూపొందించిన మార్టిన్ లూథర్ కింగ్‌పై ఈ నెల 29న సమీక్ష చేస్తున్నట్లు వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. పౌర గ్రంథాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సినిమాకు కేరాఫ్ కంచరపాలెం దర్శకుడు వెంకటేష్ మహా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారని చెప్పారు.

చేపల మార్కెట్ నిర్మాణం కోసం వినతి



మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో చేపల మార్కెట్ నిర్మించాలని మత్స్యకార మహిళలు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను కోరారు. గ్రేటర్ విశాఖ నగర మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఎంపీ నివాసంలో ఎంవీవీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన సాయంత్రం తోటగరువు సమీపం నిర్మాణంలో ఉన్న రైతు బజార్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని సందర్శించారు. అక్కడ మత్స్యకార మహిళలు తమకు చేపలు విక్రయించడానికి షాపులు నిర్మించాలని కోరారు. జీవీఎంసీ 10, 11, 12 వార్డుల్లో 60 మంది చేపలు విక్రయించే మహిళలు ఉన్నారని, వారందరికీ చేపలు మార్కెట్ ఏర్పాటు చేసి షాపులు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, సంఘం అధ్యక్షుడు వర్మ, మహిళలు కనకమహాలక్ష్మి, పైడితల్లి, ఎర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో టోకరా!

- 30 మంది నుంచి రూ.50 లక్షలు వసూలు
- ఆర్నెల్లుగా పరారీలో నిర్వాహకురాలు

పెందుర్తి: చీటీల పేరుతో ఓ మహిళ తమను మోసం చేసిందని బాధితులు శుక్రవారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. దాదాపు 30 మందికి రూ.50 లక్షలకు పంగనామం పెట్టింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..పెందుర్తి అఖిలేశ్వరి ఆస్పత్రి సమీపంలో మెండ పార్వతి అనే మహిళ చాలాకాలంగా చీటీలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వివిధ రకాల చీటీల పేరుతో దాదాపు 30 మంది వద్ద రూ.50 లక్షల వరకు వసూలు చేసింది. అయితే పాడుకున్న నగదు తన వద్ద ఉంచితే అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి ఆ నగదు తన వద్దే ఉంచుకునేది. అయితే వడ్డీ సక్రమంగా ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి వారు పార్వతిని నిలదీశారు. దీంతో ఆర్నెల్ల కిందట ఆమె పెందుర్తి నుంచి పరారైంది. ఆమె ఆచూకీ కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో బాధితులు శుక్రవారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

సరకు రవాణాలో ఆర్టీసీ ముందడుగు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ ఆర్టీసీ సరకు రవాణాలో మరో ముందడుగు వేసింది. సరకు రవాణాకు సంబంధించి డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవ పోస్టర్‌ను శుక్రవారం కార్గో పార్శిల్ కార్యాలయం వద్ద జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి తక్కువ చార్జీలతో డోర్ డెలివరీ చేస్తున్నట్టు తెలిపారు. రూ.కేజీ వరకు రూ.18, కేజీ నుంచి 6 కేజీల వరకు రూ.30, 6 కేజీల నుంచి 10 కేజీల వరకు రూ.36, 10 కేజీల నుంచి 25 కేజీల వరకు రూ.48, 25 కేజీల నుంచి 50 కేజీల వరకు రూ.59లకే పార్సిల్, కొరియర్ డోర్ డెలివరీ సదుపాయం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్, అధికారులు అప్పలనాయుడు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు ఏర్పాట్లు

- చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ నేడు



బహిరంగ సభ ప్రదేశాన్ని భీమిలి సీఐ రమేష్‌తో కలిసి పరిశీలిస్తున్న ఏసీపీ శివరామిరెడ్డి

తగరపువలస: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శనివారం మధ్యాహ్నం చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఈ యాత్రలో భాగంగా ఎండాడలోని వైఎసార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు మీడియా సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం యాత్రలో పాల్గొన్న మంత్రుల బృందం చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బోయిపాలెం కూడలి నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రారంభమై తగరపువలస వరకు సాగుతుంది. చివరగా చిట్టివలస బంతాట మైదానంలో మధ్యాహం 3 గంటలకు జరిగే బహిరంగ సభకు జీవీఎంసీ, భీమిలి నియోజకవర్గానికి చెందిన ప్రజలు హాజరు కానున్నారు. బహిరంగ సభకు 30 వేల మంది వరకు హాజరుకానున్నట్టు అంచనా వేశారు. ప్రజల సౌకర్యార్థం 16 వేల కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.

బస్సు యాత్ర విజయవంతానికి కృషి

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్ర విజయవంతానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించారు. మరోవైపు శుక్రవారం మధురవాడ జోన్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి, భీమిలి సీఐ డి.రమేష్ చిట్టివలస బంతాట మైదానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆయుధాల ప్రదర్శన



ఆయుధాలను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్, విద్యార్థులు

దొండపర్తి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం బ్యారెక్స్ ప్రాంతంలో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆయుధాల ప్రదర్శన(ఓపెన్ హౌస్) నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం పోలీస్ వ్యవస్థ పనితీరు, పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీంల ప్రదర్శనలను కళాశాలలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏడీసీపీ, ఏసీపీలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

'మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్' జీవీఎంసీ కార్యవర్గం ఎన్నిక

డాబాగార్డెన్స్: ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా పీతల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. జీవీఎంసీ సమావేశ మందిరంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డొప్పలపూడి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శులు అప్పలరాజు, రవి, కోశాధికారి నాగేశ్వరరావు జిల్లా అధ్యక్షుడితో పాటు జీవీఎంసీ కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేషన్ జీవీఎంసీ అధ్యక్షుడిగా రమణ(ట్యాక్స్ కలెక్టర్), ప్రధాన కార్యదర్శిగా బిర్లంగి శంకరరావు, ఉపాధ్యక్షులుగా గణపతి, ఎల్లంనాయుడు, కృపానందం, కార్యదర్శిగా సయ్యద్ సుభాన్, నిర్వాహక కార్యదర్శిగా కిలాని అప్పారావు, కోశాధికారిగా వై.అప్పారావు ఎన్నికయ్యారు. మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ కృషి చేస్తుందని ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గం తెలిపింది. ఈ మేరకు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నామని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్తామన్నారు. జీవీఎంసీ జెమ్స్ అధ్యక్షుడు అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు రాజేష్, కోశాధికారి సన్ని, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు, వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి నర్సింగరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఏపీకి జగన్ ఎందుకు కావాలి' విజయవంతం చేయండి



18వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: వచ్చేనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. 18వ వార్డులో జరిగిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ద్వారా మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి సేవలందించాలన్నారు. తద్వారానే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం వేగంగా జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో ఎందుకు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలో ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

– 17వ వార్డులో కూడా ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంపై ఎంపి ఎంవీవీ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై పార్టీ శ్రేణులతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు గేదెల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



దుర్గాబజార్ వద్ద వీల్‌చైర్‌లో ఉన్న వృద్ధుడితో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేసినట్టు విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. దుర్గాబజార్‌లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ఏయే సంక్షేమ పథకాలు అందాయి, వాటి ద్వారా ఎంతెంత లబ్ధి పొందారో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పాలన ఏవిధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం గురించి కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ వనము వరలక్ష్మి, పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బొండా శ్రీనివాసరావు, నగర కార్యదర్శి చొక్కర శేఖర్, స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, వీర్రాజు, దుర్గారావు, శిరీషా, బేగం పాల్గొన్నారు.

షిర్డీ సాయి సన్నిధిలో సేవలకు విశాఖ బృందం



షిర్డీ వెళ్లనున్న బృంద సభ్యులతో సత్యకుమార్ తదితరులు

ఎంవీపీ కాలనీ: షిర్డీలో భక్తులకు సేవలు అందించేందుకు విశాఖ నుంచి ప్రత్యేక బృందం తరలివెళ్లనుంది. షిర్డీలోని శ్రీసాయిబాబా సంస్థాన్ ఆలయంలో ఈ బృంద సభ్యులు పది రోజుల పాటు వివిధ రకాల సేవలు అందించనున్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని షిర్డీ సాయి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆయా సేవలు అందించేందుకు నగర భక్తుల బృందం ఏటా షిర్డీ వెళ్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షిర్డీ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఈ ఏడాది 40 మంది సభ్యుల బృందం సేవలకు వెళ్లనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి.సత్యకుమార్ తెలిపారు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు ఈ బృందం అక్కడ సేవలు అందిస్తుందన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్
9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com